లోక కల్యాణం కోసమే విశ్వకర్మ యజ్ఞం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ఉప్పల్: లోక కల్యాణం కోసమే విశ్వకర్మలు మహా యజ్ఞం చేస్తున్నారని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మ ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ చైతన్యం ప్రారంభమైందన్నారు. బీసీలు ఐక్యమత్యంతో ముందుకు సాగితేనే మన వాటాను మనం సాధించుకోవచ్చన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మల కోసం ఉప్పల్ భగాయత్‌లో ఐదెకరాల స్థలాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం బీసీల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. బీసీ వర్గాల నుంచి తెలంగాణ తొలి స్పీకర్‌గా తనకు అవకాశం కల్పించిందన్నారు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరి గౌరీశంకర్, ఉపేంద్ర, విశ్వకర్మ భవన ట్రస్టు చైర్మన్ వెంకటాచారి, కార్యదర్శి సుందర్, మదన్‌మోహన్, గణేషాచారి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు.

కుషాయిగూడ: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీలో శ్రీవిరాట్ విశ్వకర్మ 18వ యజ్ఞమహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విశ్వశాంతి కోసం ప్రతి ఏటా యజ్ఞం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్, నూతలపాటి మల్లికార్జునరావు, కేశోజు లక్ష్మీనారాయణచారి, సమ్మని మురళిచారి, శ్రీనివాసచారి, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల



హెచ్‌బీకాలనీలో యజ్ఞంలో ఎమ్మెల్యే బండారి

సంస్కృతి టౌన్‌షిప్ ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలు

మాజీ అధ్యక్షుడు బద్ధం వెంకట్‌రెడ్డి ఆరోపణ



ఆర్థిక నివేదికను పరిశీలిస్తున్న మాజీ అధ్యక్షుడు బద్ధం వెంకట్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక లావాదేవీల్లో భారీగా అక్రమాలు జరిగాయని మాజీ అధ్యక్షుడు బద్ధం వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఆర్థిక నివేదికను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... టౌన్‌షిప్‌లోని దుకాణాల నుంచి అద్దె రూపంలో రావాల్సిన రూ. 42 లక్షలు, ఇంటర్నెట్ కేబుల్ నుంచి సమకూరే రూ. 19 లక్షలు, ఇతర ఆదాయ వనరుల ద్వారా వచ్చే రూ. 2 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నిస్తే ప్రస్తుత అధ్యక్షుడు హరిప్రసాదరావు పొంతనలేని సమాధానం ఇస్తున్నట్లు చెప్పారు. ఆదాయ వనరులను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేస్తున్నందుకే ఇటీవల జరిగిన అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో ఆర్థిక నివేదికపై పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అభ్యంతరాలను నివృత్తి చేయడంలో కమిటీ సభ్యులు ఘోరంగా విఫలమయ్యారన్నారు.

కుక్కలకు 'ఏఆర్‌వీ' టీకాలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ రేబిస్ డేను పురస్కరించుకొని ఆదివారం కుక్కలకు యాంటీ రేబిస్ టీకా(ఏఆర్‌వీ)లను వేశారు. బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధుల సహకారంతో వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలకు టీకాలు ఇచ్చారు. అనంతరం నారపల్లిలోని నందన వనం వద్ద స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ హరిప్రసాదరావు, బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధి కుమారి, వెటర్నరీ వైద్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



శునకాలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యులు

ఘనంగా గణేష్ నిమజ్జనాలు.. లడ్డూల వేలం పాటలు



లడ్డూ దక్కించుకున్న సంతోష్‌రెడ్డి

మేడ్చల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు 21 రోజులు పూర్తి కావడంతో శని, ఆదివారాల్లో వివిధ గ్రామాలు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేసి, లడ్డూల వేలంపాటలు కూడా నిర్వహించారు. డబీల్‌పూర్ హనుమాన్, అత్వెల్లి నక్షత్ర, ఛత్రపతి శివాజీ యూత్‌ల విగ్రహాలను నిమజ్జనం చేశారు. డబిల్‌పూర్ హనుమాన్ యూత్ వినాయకుడి లడ్డూను గ్రామానికి చెందిన వీర్లపల్లి సంతోష్‌రెడ్డి రూ1.56 లక్షలకు సొంతం చేసుకున్నాడు. మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, సీనియర్ నాయకుడు భాగ్యారెడ్డి, కౌన్సిలర్లు మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, సరితమల్లేష్‌గౌడ్, ప్రియాంక మధుకర్‌యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

నేడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్న ఆర్యవైశ్య సంఘం

కీసర: తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీ పొట్టి శ్రీరాములు పేరును యధావిధిగా ఉంచాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు ఆర్యవైశ్య సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న ఆర్యవైశ్య ప్రముఖులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం రమేష్‌గుప్తా కీసరలో మాట్లాడుతూ... తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యధావిధిగా ఉంచాలని రెండు రాష్ట్రాల ఆర్యవైశ్యం సంఘం నేతలు, తెలుగు భాషాభిమానులు కోరారన్నారు. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో విశ్వవిద్యాలయం పేరు మార్పునకు కేబినెట్ ఆమోదం తెలపడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునేదాకా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కొమురవెల్లి మల్లన్న సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్నకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లన్న (చామకూర మల్లారెడ్డి) ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన కొమురవెల్లికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి దర్శనం చేసుకున్నారు. సతీమణి కల్పనారెడ్డి, కూతురు మమతరెడ్డిలతో కలిసి ఆలయానికి వెళ్లారు. ఇటీవల ఎమ్మెల్యే మల్లారెడ్డిలు తీర్థయాత్రలు చేస్తున్నారు. తమిళనాడులోని ముధురై, రామేశ్వరం తదితర ఆలయాలను సికింద్రాబాద్ తాడ్‌బందు వీరంజనేయ స్వామి ఆలయాలను దర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, భాగ్యారెడ్డి, దయానంద్‌యాదవ్ పాల్గొన్నారు.



మల్లన్న ఆలయం వద్ద ఎమ్మెల్యే మల్లారెడ్డి, కటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు

గర్భిణులు, చిన్నారుల్లో.. రక్త హీనత

నివారణే లక్ష్యంగా..

పౌష్టికాహార లోపంపై నాలుగు థీమ్‌లుగా అవగాహన

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

స్లమ్స్, బస్తీలు, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పౌష్టికాహార లోపంతో గర్భిణులు, చిన్నారులు రక్త హీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. సమస్య తీరడం లేదు. ఈ నేపథ్యంలోనే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు పోషణపై కార్యక్రమాలు చేపడుతున్నారు. 30 రోజుల పాటు నిర్వహిస్తున్న పోషణ కార్యక్రమాన్ని నాలుగు థీమ్‌లుగా చేపడుతున్నారు. వారానికి ఒక థీమ్ చొప్పున నాలుగు థీమ్‌లతో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు గ్రోత్ మానిటరింగ్, పోషణ్ భీ పఢాయ్ భీ, రక్తహీనత, యుక్త వయస్సు, గర్భధారణ, పరిశుభ్రతపై 793 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బస్తీలు, స్లమ్స్, వెనుకబడిన ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ, భద్రత తదితర అంశాల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోషకాహారం తీసుకునేలా ప్రేరేపించడం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, మహిళల ఆరోగ్యం, బాలలకు పోషణతో పాటు చదువు తదితర అంశాలను ఈ నెల 30 వరకు విజయవంతంగా కొనసాగేలా పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

793 కేంద్రాల్లో..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 793 అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. వీటిలో 68,918 మందికి పైగా చిన్నారులు నమోదవ్వగా.. రోజూ వారికి 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 0.5 గ్రాముల ఆయిల్, 50 గ్రాముల గుడ్డు, 20 గ్రాముల మురుకులు, 50 గ్రాముల బాలామృతం అందజేస్తున్నారు. 9, 972 మంది గర్భిణులు, బాలింతలకు సైతం ప్రత్యేక ఆహారం ఇస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రోత్ మానిటరింగ్ సర్వే ప్రకారం 3,649 మంది చిన్నారులు వారి వయస్సు కంటే తక్కువ ఎత్తు, బరువున్నారు. 961 మంది పిల్లలు అతి తక్కువ ఎత్తు, బరువున్నట్లుగా గుర్తించారు. గర్భిణులను కూడా రక్తహీనత వెంటాడుతోంది. దీని కారణంగా ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు జరగడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు

జిల్లా వ్యాప్తంగా పోషణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ, ప్రణాళిక రూపొందించి నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. పోషకాహార లోపం నివారణే లక్ష్యంగా తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాయచూరి నుంచి శ్రీ రాఘవ నాట్యామృత కళానికేతన్ నాట్య గురువు శ్రేయస్ జ్యోషి శిష్య బృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణేశా, త్రిమాత కౌత్వం, శివస్తుతి, దశావతారం, అన్నమయ్య కృతి, కళింగ నర్తన, అభంగ్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేషనల్ కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం



పతకంతో ప్రభాత్‌యాదవ్

మల్కాజిగిరి: ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలో 21 వరకు జరిగిన 15వ జాతీయ కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీలో మల్కాజిగిరికి చెందిన అడ్ల ప్రభాత్‌యాదవ్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఉత్తర్‌ప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ గుర్తింపు పొందిన యూపీ కుంగ్‌ఫూ అసోషియేషన్ ఈ పోటీలను నిర్వహించగా.. 35 కేజీల సాండాఫైట్ కేటగిరిలో తెలంగాణ రాష్ట్రం తరుపున పోటీలో పాల్గొన్న ప్రభాత్ స్వర్ణం సాధించాడు.

ఉచిత వైద్య శిబిరం



హెచ్‌బీకాలనీలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కుషాయిగూడ: పేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ కృష్ణ ప్రసాద్ అన్నారు. మీర్‌పేట్ హెచ్‌బీకాలనీలోని టూబీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, రామారావు, హనుమంతరావు, కిషన్‌రావు, దేవీరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాంపల్లి 2వ వార్డులోని ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్‌లో సుమారు రూ. 85 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు, పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్ల సూచన మేరకు మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో తీర్మానించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తున్నన్నారు.

దేశంలో ఐటీ ప్రదాత రాజీవ్‌గాంధీ

ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద వీహెచ్ తదితరులు

రామంతాపూర్: దేశంలో ఐటీ రంగాన్ని ప్రవేశపెట్టిన ఐటీ ప్రదాత రాజీవ్‌గాంధీ అని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ విశ్వనాథన్ అన్నారు. ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ప్రాంగణంలో ఆయన ఆ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో ఐటీ ప్రవేశపెట్టిన లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందన్నారు. త్వరలోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, క్రికెట్ స్టేడియం ప్రతినిధి దేవరాజ్ పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ సూర్యనగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 1981లో ఏర్పాటైన కాలనీలో 220 ఇళ్లు ఉన్నప్పటికీ సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గుంతలమయమైన రోడ్లు, చిన్నపాటి వర్షాలకే వర్షపు నీరు నిలవడం, వీధిదీపాలు లేకపోవడం, పలు సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నాయకులు లక్ష్మణ్ యాదవ్, రాజయ్య, సుఖీందర్‌సింగ్, ధర్మరాజు, వీరబ్రహ్మం, వినోద్‌సింగ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఘట్‌కేసర్: భిన్నత్వంలో ఏకత్వం అనేది అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా రుజువైందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మేడ్చల్ అధ్యక్షుడు కుమార్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం విభిన్న సంస్కృతులు, మతాలు, భాషలు, సాంప్రదాయలకు సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందన్నారు. దేశం ఐక్యంగా ఉండడానికి ప్రోత్సహిస్తుందన్నారు. నేతలు దాసు, రామలింగం, కిరణ్, సతీశ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు, నారాయణ, శ్రీనివాస్, నగేశ్, రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

29న ధర్నా చౌక్ వద్ద నిరసన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేఏసీ సభ్యులు

కీసర: జవహర్‌నగర్‌లోని చెత్త డంపింగ్ యార్డును తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 29న నగరంలోని ఇందిరా పార్కు దగ్గర ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు జేఏసీ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపల్ చౌరస్తా వద్ద నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాన్ని దీక్ష సన్నాహక కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యుడు కేతేపల్లి పద్మాచారి మాట్లాడుతూ... ఎన్‌జీటీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంతోపాటు, డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను అక్కడే ఏర్పాటు చేసిన విద్యుత్ ప్లాంటుకు వినియోగిస్తూ చెత్త దిబ్బలు లేకుండా చేయడం, డంపింగ్ యార్డు వల్ల కలుషితంగా తయారైన భూగర్భ జలాలను శుద్ధి చేయడం తదితర డిమాండ్లను సాధించాలనే నిరసన దీక్ష నిర్వహిస్తున్నామన్నారు. నేతలు గోగుల రామకృష్ణ, ఏనుగు సంజీవరెడ్డి, స్వర్ణశ్రీనివాస్, మారం సమ్మిరెడ్డి, శిలేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్యన గుర్తు తెలియని ఓ వ్యక్తి శనివారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని ఓ వ్యక్తి (30–35) రైలు కింద పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి ఎడమ చేతిపై తేలు బొమ్మ, కుడి చేతిపై గుడ్లగూబ బొమ్మ ఉంది. పంచానామా అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తి శవంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నియామకం



మల్లాపూర్: సీపీఐఎం నాచారం శాఖ మహాసభ నూతన కార్యదర్శిగా గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నాచారంలోని కార్యాలయంలో మహాసభను నిర్వహించగా.. మొట్ట మొదట సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా.. ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోతుందన్నారు. హైడ్రా చట్టం పేద ప్రజల మీద ఉపయోగించకుండా నిర్వాసితులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో భూములను ప్లాట్లుగా చేసి పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు, ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. మండలి కమిటీ సభ్యులుగా బీవీ. సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, పార్టీ సభ్యులు ప్రభాకర్, నూర్జహాన్, సరోజ, శ్రీనివాస్, రాంబాబు, సుధీర్, మణెమ్మ, రామకృష్ణ, రాజు, నాగమణి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



రామంతాపూర్: సీపీఎం కార్యదర్శిగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. రామంతాపూర్‌లో నెలకొన్న సమస్యలను వెంకటేశ్వర్లు కృషి చేస్తారని ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి వెంకన్న అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్: బొల్లిగూడలోని అయోధ్యనగర్ కాలనీ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జినిగె ఆంజనేయులుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా మారుతీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకుంటామన్నారు. కాలనీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పడతం లోకేష్ అభినందించారు.

శరన్నవరాత్రి మండప కర్రపూజ



గాంధీపార్కులో కర్ర పూజ చేసిన జగదీష్‌గౌడ్


మల్కాజిగిరి: గాంధీపార్కులో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా జై భవానీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే అమ్మవారి మండపం ఏర్పాటుకు కర్ర పూజ నిర్వహించారు. నిర్వాహకుడు , మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా అమ్మవారి శరన్నవరాత్రులను గాంధీపార్కులో నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నాగేందర్‌గౌడ్, అనిల్‌గౌడ్, సురేష్, కేశవ్‌దాదా, కోటేశ్వరరావు, సురేష్, నల్లవెల్లి రాజు, నవీన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్స్



రామంతాపూర్: కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ వీరా రాజారెడ్డి జన్మదినం సందర్భంగా రామంతాపూర్ రెడ్డి సంక్షేమ సంఘంలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థితికి చేరి సామాజిక బాధ్యతగా సమాజానికి తమవంతు సేవలు అందించాలని కోరారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పసుల ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ధర్మా మాధవరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నారాయణరెడ్డి, ప్రమీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బోడుప్పల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్ 14వ డివిజన్‌లో ఆదివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ కార్మికులతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెత్తచెదారాన్ని రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఆర్థిక సాయం

కీసర: అనారోగ్య కారణంగా ఇటీవల మృతిచెందిన కీసర ఎస్సీ కాలనీకి చెందిన మొరుగు యాదమ్మ కుటుంబాన్ని ఆదివారం కీసర గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని యాదమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. తుడుం శ్రీనివాస్, పుంద్రు రాకేష్, మొరుగు మహేష్, చంద్రయ్య, కర్రె గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657